

రోడ్డంతా సోయగమే..



ప్రధాన రహదారులకిరువైపులా గతంలో నాటిన మొక్కలు ఎదిగి నేడు చెట్లుగా మారి కనువిందు చేస్తున్నాయి. ఇందులో గుల్‌మొహర్ చెట్లు రంగులమయంగా మారి ప్రయాణికులకు స్వాగతం పలుకుతున్నట్లుగా ఉన్నాయి. దండేపల్లి మండలం తాళ్లపేట నుంచి ముత్యంపేట, కరీంనగర్ చౌరస్తా నుంచి మొదలు గూడెం వరకు ప్రధాన రహదారులకు ఇరుపక్కలా పలు రకాల మొక్కలు నాటారు. ఇందులో గుల్‌మొహర్ చెట్లు ప్రస్తుతం ప్రయాణికులను ఆకర్శిస్తున్నాయి. చెట్లన్నీ ఎర్రనిపూలతో అందంగా కనిపిస్తూ ఆహ్లాదం పంచుతున్నాయి. వీటితో పాటు కానుగ చెట్లు కూడా పచ్చని ఆకులతో నిండుగా మారి ప్రయాణికులకు నీడనిస్తున్నాయి. - దండేపల్లి, ఆంధ్రజ్యోతి



నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

చెన్నూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఫెర్టిలైజర్ దుకాణాల యాజమానులు ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు ఉంటాయని ఏడీఏ బానోత్‌ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం చెన్నూరులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దుకాణాల యాజమానులు రిజిష్టర్‌లు సక్రమంగా మెయింటెన్ చేయాలని సూచించారు. ఎరువులు, విత్తనాలు అమ్మిన రైతులకు రశీదులు అందించాలని సూచించారు. ఎరువుల, విత్తనాల దుకాణాలను తనిఖీ చేస్తామని, ఎవరైనా నిబంధనలు పాటించకపోతే చర్యలు ఉంటా యని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏవో యామిని, డీలర్లు పాల్గొన్నారు.

రాజీవ్‌యువ వికాసం పకడ్బందీగా నిర్వహించాలి

● ఐటీడీఏ పీవో కుష్బూగుప్తా



ఎంపీడీవోతో మాట్లాడుతున్న పీవో కుష్బూగుప్తా

జన్నారం, మే14(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా అన్నారు. బుధవారం మండల ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించగా ఎంపీడీవో ఉమర్ షరీఫ్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం ఆన్‌లైన్‌లో 520, ఆఫ్‌లైన్‌లో 420 ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసు కున్నారని వాటిని పకడ్బందీగా ఎంపిక జరుపాలన్నారు. ఆమె వెంట మంచిర్యాల డీఆర్‌డీఏ జనార్దన్ ఉన్నారు.

పంటల బీమా ఊసేది..?

- అమలు చేయడంలో సర్కారు ఉదాసీనత
- ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న అన్నదాత
- అకాల వర్షాలతో ధ్వంసమైన పంటలు
- రూ.10 వేల నష్టపరిహారానికీ నోచుకోని రైతులు..!

మంచిర్యాల, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉచిత పంటల బీమా పథకం అమలులోలేక అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ప్రకృతి వైపరీత్యాల కారణంగా తుడిచిపెట్టుకు పోతున్నా ఆదుకొనేవారు కరువయ్యారు. జిల్లాలో ఏటా అకాల వర్షాలు, వడగళ్ల వానలతో కోట్లాది రూపాయల పంట నీటిపాలవుతోంది. గతంలో పంటల బీమా పథకం అమలులో ఉన్నప్పుడు ఆలస్యంగా అయినా నష్టపరిహారం అంది కొంతమేరైనా ఉపశమనం లభించేది. నాలుగేళ్లుగా పంటల బీమా పథకం అమలు కావడం లేదు. దీంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడల్లా రైతులు నిలువునా మునిగిపోతున్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించడంలో రాష్ట్రప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. 2024 వానాకాలం సీజన్ నుంచే పంటల బీమాను పునరుద్ధరించనున్నట్లు చెప్పిన ప్రభుత్వం... 2024 వానాకాలం, 2024-25 యాసంగి పంట కాలాల్లోనూ పంటల బీమాను అమలు చేయలేదు. ఇప్పుడు తాజాగా 2025 వానాకాలం నుంచి అమలు చేస్తామని చెబుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇప్పటి వరకు పంటల బీమాపై విధివిధానాలను ఖరారు చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వ్యవసాయ శాఖ అధికారులకు ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ఈ సీజన్‌లో కూడా పథకం అమలు అయ్యే అవకాశాలు కానరావడంలేదు.

ఫసల్ బీమా యోజన ద్వారా....

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో 2018-19 సీజన్ వరకు అమలుచేసి, నిలిపివేశారు. ఇదివరకు వివిధ పంటలకు బీమా చేసేందుకు నోటిఫికేషన్ వెలువరించి రైతుల నుంచి ప్రీమియం తీసుకునేవారు. వరికి గ్రామం యూనిట్‌గా, మొక్కజొన్న, కంది, పెసర, మినుము, సోయా, పసుపు, వేరుశనగ, నువ్వుల పంటలకు మండలం యూనిట్‌గా బీమా వర్తింపజేసేవారు. వాతావరణ ఆధారిత బీమా పరిధిలో వానా కాలం మిరప, పత్తి, యాసంగిలో మామిడి పంటలుండేవి. బ్యాంకుల నుంచి రైతులు పంటరుణం తీసుకునే సమయంలోనే వానాకాలం సీజన్‌కు 2 నుంచి 5 శాతం, యాసంగిలో 1.5 నుంచి 5శాతం ప్రీమియం బ్యాంకర్లు తప్పనిసరిగా మినహాయించి బీమా ప్రీమియం కంపెనీకి చెల్లించేవారు. రైతులు చెల్లించిన కిస్తీ మొత్తంతో సమానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిగిలిన సగం ప్రీమియం రైతు రాయితీగా కంపెనీకి చెల్లించేవి. కానీ కిస్తీ చెల్లింపును రైతుల ఇష్టాను సారం చేయడం, రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు వెలువరించక పోవడంతో పంటల బీమా పథకం కొన్నేళ్లుగా నిలిచిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం కిస్తీ చెల్లించి బీమాను వెంటనే అమలులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

అటకెక్కిన హామీ...

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) లో చేరడంతో పాటు పంటల బీమా కోసం రైతుల వాటా ప్రీమియం కూడా చెల్లిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని పసల్ బీమా యోజనతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకుంటున్న పంటల బీమా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కొంత మేర కసరత్తు చేసినా.... ఆ తర్వాత ప్రభుత్వం దాన్ని పక్కనబెట్టింది. వాస్తవానికి గత వానాకాలంలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. టెండర్లను ఏక మొత్తంగా కాకుండా క్లస్టర్ల వారీగా పిలవాలని వ్యవసాయశాఖ నిర్ణయించినట్లు సమాచారం. పీఎంఎఫ్‌బీవై మార్గదర్శకాలను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని అందుబాటులోకి తేవాలనుకున్న నేపథ్యంలో ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంది. అయితే టెండర్ల ప్రక్రియ పూర్తయితేనే నిధులపై స్పష్టత వస్తుంది. రాష్ట్రం వాటా చెల్లించిన తర్వాతే కేంద్రం వాటా జమ చేస్తుంది. ఉచిత పంటల బీమా పథకం అమలు కోసం బీమా కంపెనీలతో ఒప్పందాలు,

మిగతా 7లో

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా



చెన్నూరు మంచిర్యాల ప్రధాన రహదారి కిష్టంపేట వద్ద ధర్నా చేస్తున్న రైతులు

చెన్నూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ బుధవారం రైతులు ధర్నాకు దిగి రోడ్డెక్కారు. మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సకాలంలో కొనుగోలు చేయడం లేదని పేర్కొంటూ చెన్నూరు-మంచిర్యాల ప్రధాన రహదారి కిష్టంపేట వద్ద ధర్నాకు దిగి ఆందోళన చేశారు. రైతులు మాట్లాడుతూ అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నా అధికారులు కానీ పాలకులు కానీ పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. వరి కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట 4నుంచి 5కిలోల వడ్లను దోచుకుంటున్నారని వారన్నారు. ఎలాంటి తరుగు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కలెక్టర్ వచ్చేంత వరకు ధర్నా విరమించేది లేదని భీష్మించుకు కూర్చోవడంతో ఎటు వాహనాలు అటే నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న దేవేందర్‌రావు చేరుకుని ధర్నా చేస్తున్న రైతులను శాంతింపజేశారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ధర్నాలో కిష్టంపేట, ఎల్లక్కపేట, సుద్దాల గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

బీసీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

● బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు

నస్పూర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఎంబీసీ, డిఎస్‌టీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, సంచార జాతుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వైద్య భాస్కర్ డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో ఏవో రాజేశ్వర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంచార కులాలు డీఎస్‌టీకి శాశ్వత కమిషన్ ఏర్పాటు చేయాలని, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో సంచార కులాలను చేర్చాలన్నారు. బీసీ, ఎంబీసీ, డీఎస్‌టీలకు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చే యాలన్నారు. ఎంబీసీ, డీఎస్‌టీల స్థితిగతులపై బీసీ కమిషన్‌చే అధ్యయనం చేయించి దానికి అనుగుణంగా అభివృద్ధి కోసం త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంబీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చే యాలన్నారు. డీఎస్‌టీకి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. దేశవ్యాప్తంగా స్థానిక సంస్థల రిజర్వేషన్లను ఏబీసీడీ గ్రూపులుగా వర్గీకరిం చాలని, ఇందులో సంచార జాతుల కులాలకు కూడా అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. ఈకార్యక్రమంలో తెలంగాణ గంగ పుత్రుల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సయ్య, జాతీయ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి చేరాల వంశీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరీశ్‌గౌడ్, బీసీ నాయకులు శాకపూరి భీమేశ్, సీపతి రాములు, వేముల కిరణ్ పాల్గొన్నారు.

అకాల వర్షం..అన్నదాత ఆగమాగం

● ధాన్యం కుప్పల వద్దకు రైతుల పరుగులు



దండేపల్లిలో ధాన్యం బస్తాలపై కవర్లు కప్పుతున్న రైతులు

దండేపల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): అకాల వర్షం రైతులను అతలాకుతలం చేస్తోంది. బుధవారం ఉదయం కురిసిన వర్షంతో మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. ముందుగానే కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కాపాడునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. కొనుగోలు కేంద్రాలలో సరి పడా టార్పిలిన్ కవర్లు లేకపోవడంతో అద్దెకు కవర్లు తీసుక వచ్చి కప్పారు. ధాన్యంను వెంట వెంట తూకం వేసి రైస్ మిల్లులకు తరలించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మందమర్రిరూరల్ : మండలంలో బుధవారం తెల్లవా రుజమున కురిసిన అకాల వర్షానికి సారంగపల్లి, పొన్నారం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం తడి సిపో యింది. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకు న్నారు. ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆవేదన చెందుతు న్నారు. అధికారులు స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరారు.

భీమారం : మండలంలో బుధవారం తెల్లవారుజా మున కురిసిన అకాల వర్షంతో అన్నదాతలు అతలాకుతలమయ్యారు. ఇప్పటికే కొనుగోలుకేంద్రాల్లో ఆరబెడుతున్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు తీవ్రఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం టార్పాలిన్ కవర్లు అందిస్తున్నా కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నిర్లక్ష్యంవల్ల టార్పాలిన్‌లు అందుబాటులో ఉండడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంట నేలమట్టం కాగా ఏ అధికారి కూడా వచ్చి చూడలేదని రైతులు పేర్కొంటున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

నస్పూర్ : నస్పూర్ పట్టణంలో బుధవారం తెల్లవారుజా మున 3.30గంటల నుంచి 5గంటల వరకు భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా రోడ్లపై వరదనీరు ప్రవహించింది. డ్రైనేజీలు వర్షపు నీటితో నిండి పొంగి పొర్లాయి. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసయడంతో కొద్దిసేపు విద్యుత్ అంతరాయం నెలకొంది. బుధవారం తెల్లవా రుజామున దాదాపు 5సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైయ్యింది..

శానిటరీ ఇన్‌స్పెక్టర్ బదిలీ ఆపాలని నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు

నస్పూర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల నగర పాలక సంస్థలో సానిటరి ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉదయ్ కిరణ్ ను అకారణంగా డిప్యూటేషన్‌పై బదిలీ చేశారని, బదిలీని నిలిపివేయాలని కోరుతూ తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తంచేసి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ సానిటరి ఇన్స్‌పెక్టర్‌ను అకారణంగా బదిలీ చేశారని, వెంటనే తిరిగి ఇక్కడే నియమించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు దేవి సత్యంతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, పట్టణ అభివృద్ధిపై దృష్టి

● ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమం, పట్టణ అభి వృద్ధి విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. పట్టణంలోని 18వ వార్డు గాంధీనగర్‌లో రూ. 5 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకవర్గంలేని మందమర్రి మున్సిపాలిటీ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేస్తానని పేర్కొన్నారు. ఇప్పటికే పట్టణంలోని 24 వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. దాదాపు రూ.20కోట్లకుపైగా పనులు కొనసాగుతున్నాయని, ఈ పనులు 6నెలల్లో పూర్తి కావస్తాయన్నారు. కాంట్రాక్టర్లు నాణ్యతతో పనులను చేయాలని, లేదంటే బిల్లులు నిలిపి వేస్తామన్నారు. వార్డు ప్రజలు డ్రైనేజీలు, సెప్టిక్ ట్యాంకు నిర్మించాలని కోరగా మున్సిపల్ కమిషనర్ రాజలింగును సెప్టిక్ ట్యాంకు కోసం స్థలం పరిశీలించాలని సూచించారు. అనంతరం నాయకులు, ప్రజలు ఎమ్మె ల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

సఖీ కేంద్రం తనిఖీ



సఖీ కేంద్రాన్ని సందర్శించిన రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి

మంచిర్యాలక్రైం, మే14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళ ఉమెన్ కమిషన్ సభ్యురాలు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సఖీకేంద్రాన్ని సందర్శిం చారు. ఈ సందర్భంగా సఖీకేంద్రంలో నమోదైన కేసుల వివరాలు అన్ని రకాల రికార్డులను వివరాలను తెలుసుకున్నారు. న్యాయసేవలు గురించి తెలుసుకున్నారు. మహిళలకు సఖీ కేంద్రం అందించే వెల్‌కం కిట్లను పరిశీలించారు. పట్టణాలలో, గ్రామాలలో సఖీకేంద్రం అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సఖీ కేంద్రం అడ్మినిస్ట్రేటర్, లీగల్‌కౌన్సిలర్, కేసువర్కర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలి

● అమెరికా వాసులకు మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ పిలుపు

మంచిర్యాల, మే14(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని లాస్ ఏంజెల్స్ నగరంలో జూన్1న నిర్వహించ తలపెట్టిన తెలంగాణ ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్కసుమన్ కోరారు. ఈమేరకు ఆయన పై విధంగా బుధవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన అక్కడ నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో కాలిఫోర్నియాలోని లాస్ ఏంజెల్స్‌లో అక్కడి బీఆర్ఎస్ నాయకులతో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా బాల్కసుమన్ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ, బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలకు మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతున్నారని అక్కడి బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ అయిన శ్రీ బండి సదానందం తండ్రి: బండి కొమురయ్య వయస్సు: 47 సం.లు, వృత్తి : వ్యాపారం, ఇ.నెం. 42-46, మారుతి నగర్, మందమర్రి మండలం : మందమర్రి, జిల్లా : మంచిర్యాల, రాష్ట్రం తెలంగాణ.

రిజిస్ట్రేషన్ జిల్లా ఆదిలాబాద్, జిల్లా మంచిర్యాల జిల్లా పరిషత్ మంచిర్యాల, రెవెన్యూ మండలం మందమర్రి, మున్సిపాలిటీ క్యాతన పల్లి పరిధిలోని గం గ్రామము [illegible] సర్వే నెం. 375లోని ప్లాటు నం. 64, 65 యొక్క విస్తీర్ణం 328 చ.గజ [illegible] 274.24 [illegible] హద్దులు : తూర్పు: 30 ఫీట్ల రోడ్డు, పడమర : బి. రాజ్యలక్ష్మి గారి భూమి, ఉత్తరం : ఇతరుల భూమి, దక్షిణం : 25 ఫీట్ల రోడ్డు.

పై స్థిరాస్తి శ్రీ బండి సదానందం తండ్రి : బండి కొమురయ్య గారు పూర్తి హక్కుదారులుగా వుండి నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, మంచిర్యాల బ్రాంచ్ నందు తనఖా పెట్టుచున్నారు. పై స్థిరాస్తి ఎవరికైనా ఎలాంటి అభ్యంతరాలు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన (7) రోజులలోగా పూర్తి సాక్ష్యాధారాలతో సంప్రదించగలరు.

ఇట్లు సం/- నోముల రాజ్‌కుమార్, అడ్వకేట్
రూం నెం. 15, కోర్టు కాంప్లెక్స్, మంచిర్యాల.
సెల్ : 98492 14324

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE AT:BELLAMPALLI

O.S.NO. 135 OF 2024

Between:
Bore Narsaiah ...Plaintiff
And
Bore Lingamma and anothers ... Defendant.

To,
To whom so ever it may concern..

Whereas the above named Plaintifs has instituted the Suit for declaration of status in favour of them. The said suit stands posted on 09-6-2025, at 10-30 AM answer the claim your appearance.

Therefore anybody has got any objection which regards to the claim right and interest in the above said suit, they may appear by person or through an Advocate on 09- 6-2025, at 10-30 A.M before the Hon'ble court and to answer the claim. Failing which, your absence. the matter will be heard and decided in

Date: -05-2025
Place: Mancherial.

// By order of the Court //
Sd/- NERELLA LAXMIRAJAM
Advocate, Mancherial

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి


రాజశేఖర్(ఫైల్)

శ్రీరాంపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్‌పీ 3 గనికి చెందిన యువ కార్మికుడు ప్యాగ రాజశేఖర్ (36) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. రెండు రోజుల క్రితం ఇంట్లో ఉన్న సమయంలో ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులు మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని వేలాలలోని అతని స్వగృహంలో టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ పరామర్శించారు.

ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు తాకి ఒంటె మృత్యువాత


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఒంటె కళేబరం

దండేపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాకులపేట గ్రామ శివారులో మేత కోసం వెళ్లిన ఒంటె పంట పొలాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తాకి అక్కడికక్కడే మృత్యువాత పడింది. దండేపల్లి గ్రామానికి చెందిన బొలిశెట్టి దేవేందర్‌కు చెందిన గొర్రెల మందతో కలిసి ఒంటె బుధవారం ఉదయం మేత కోసం మాకులపేట శివారుకు వెళ్లింది. మేత మేస్తున్న క్రమంలో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ సుమారు 95వేల రూపాయలు ఉంటుందని బాధితుడు దేవేందర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


మృతిచెందిన గేదె వద్ద బాధిత రైతు

దండేపల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం ధర్మరావుపేట గ్రామానికి చెందిన గోట్ల సత్తయ్య అనే రైతుకు చెందిన బర్రె గ్రామ శివారులోని మేత కోసం వెళ్లి కరెంట్‌షాక్‌తో మృతి చెందింది. బుధవారం ఉదయం గ్రామ శివారులో మేత కోసం వెళ్లింది. మేత మేస్తుండగా విద్యుత్ తీగ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందిందని బాధిత రైతు సత్తయ్య వాపోయారు. దీని విలువ సుమారు 60వేల రూపాయలు ఉంటుందన్నారు. అధికారులు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆయుర్వేద వైద్యం అందేనా..?



- డిప్యూటేషన్‌పై వైద్యురాలు
- పట్టింపులేని జిల్లా అధికారులు
- పేదలకు అందని సేవలు

బెజ్జూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలు అందించిన ఆయుర్వేద వైద్యశాల ఇప్పుడు ఉన్నా ఏం ఉపయోగం లేదని మండలవాసులు వాపోతున్నారు. ఇక్కడ పనిచేసే వైద్యురాలు డిప్యూటేషన్‌పై వేరే జిల్లాకు వెళ్లడంతో గ్రామీణులకు వైద్యసేవలు అందడం లేదు. బెజ్జూరు మండల కేంద్రంలోని ఆయుర్వేద వైద్యశాలలో పనిచేస్తున్న వైద్యురాలు గత నెలలో నల్లగొండ జిల్లాకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. దీంతో ఆయుర్వేద వైద్యశాల మూతబడే అవకాశం కనిపిస్తోంది.


డాక్టర్ లేక ఖాళీగా ఉన్న కుర్చీ

వైద్యురాలు గతంలో ఉన్న సమయంలో సక్రమంగా విధులకు హాజరు కాకపోవడంతో దవాఖాన ఉన్నా లేనట్టుగా తయారైందన్న విమర్శలు వస్తున్నాయి. మారుమూల ప్రాంతాల్లో ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు ఎంతో నమ్మకం ఉన్నా స్థానికంగా మందులు కూడా ఇచ్చేవారు లేక రోగులు అవస్థలు పడుతున్నారు. కరోనా తర్వాత ప్రజలు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతుండగా, ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు ఉన్న నమ్మకం నెరవేరడం లేదు.

● అవస్థల్లో రోగులు..

మారుమూల గ్రామాల్లో ఇప్పటికీ ఆయుర్వేద వైద్యంపై నమ్మకం ఎక్కువ. ఇప్పుడున్న కాలంలో ప్రజలు వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమవుతుండటంతో ఎక్కువగా ఆయుర్వేద వైద్యాన్ని నమ్ముకుంటున్నారు. ఈ క్రమంలో ఆయుర్వేద మందులు వాడితేనే వ్యాధులు దూరమవుతాయనేది గ్రామాల్లో నమ్ముతుంటారు. వైద్యురాలు డిప్యూటేషన్‌పై సూర్యాపేటకు వెళ్లగా, ప్రభుత్వం డిప్యుటేషన్లు రద్దు చేయడంతో తిరిగి విధుల్లోకి చేరిన రోజే కొద్ది నెలలు లాంగ్‌లీవ్ పెట్టారు. కొద్ది నెలలు విధుల్లోకి హాజరై తిరిగి గత నెల 8వ తేదీ నుంచి మళ్లీ నల్లగొండ జిల్లాకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. దీంతో గ్రామాల్లో వైద్య సేవలు అందక ప్రైవేటులో అధిక ఖర్చుతో వైద్య సేవలు పొందుతున్నారు.

అయితే అధికారులు సైతం ఈ విషయంలో పట్టింపులేనితనంగా వ్యవహరిస్తున్నారని మండల వాసులు వాపోతున్నారు. రెండేళ్ల నుంచి ఇక్కడ వైద్యసేవలు అందకపోవడంతో దీర్ఘకాలిక రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాధితులకు అండగా భరోసా సెంటర్

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు


మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): బాధిత మహిళలు, పిల్లలకు అండగా భరోసా సెంటర్ సేవలు అందిస్తోందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. లైంగిక దాడికి గురైన మహిళలకు, బాలికలకు అండగా భరోసా సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ ద్వారా వచ్చిన విక్టిమ్ అసిస్టెంట్ ఫండ్‌ను బాధిత మహిళలైన ఎనిమిది మందికి ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయల చొప్పున 40 వేల రూపాయల విలువైన చెక్కులను జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల్లో బాధిత మహిళలకు కౌన్సెలింగ్ ఇస్తామని, మెడికల్ ఎగ్జామినేషన్‌లో కూడా బాధితులకు అండగా ఉంటామని తెలిపారు.

భరోసా ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, భరోసా సెంటర్ ద్వారా పోలీసు సేవలు, కౌన్సెలింగ్, వైద్య, న్యాయ సేవలు అందిస్తున్నామని వివరించారు. సిబ్బంది వివిధ ప్రాంతాల్లో మహిళలు, చిన్న పిల్లలు బాధించబడితే తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఎవరైనా బాధితులు ఉన్నట్లయితే 8712670561 లేదా 100ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, భరోసా సెంటర్ ఇన్‌చార్జి మహిళా ఎస్సై తిరుమల, లీగల్ సపోర్ట్ పర్సన్ శైలజ, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ రాణా ప్రతాప్ పాల్గొన్నారు.

బస్సు షెల్టర్ కోసం స్థల పరిశీలన

జైనూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం బస్సు షెల్టర్ కోసం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణానికి ఆనుకొని ఉన్న స్థలం బస్సు షెల్టర్ కోసం అనువుగా ఉదని ఇక్కడే షెల్టర్ నిర్మాణం చేపట్టాని అధికారులు నిర్ణయించారు. జైనూరులో బస్సు షెల్టర్ లేనందున ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఇది వరకే అనేకసార్లు అధికారులకు ప్రజలు మొర పెట్టుకున్నారు. దీంతో అధికారులు స్థలాన్ని గుర్తించి బస్‌షెల్టర్ నిర్మాణం సత్వరమే పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆడ బిర్షావ్, ఎస్సై రవికుమార్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఈవో కోరేంగ ఆనంద్‌రావ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మూగజీవాలను తరలిస్తే కఠిన చర్యలు

వాంకిడి, మే 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మూగ జీవాలను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రశాంత్ హెచ్చరించారు. బుధవారం వాంకిడి మండల కేంద్రంలోని ఆర్టీఏ చెక్ పోస్టు సమీపంలో పశువుల అక్రమ రవాణా జరగకుండా ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వాంకిడి సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. ఈ చెక్ పోస్టును బుధవారం ఎస్సై ప్రశాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తిస్తే డయల్ 100 లేదా స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు.


చెక్ పోస్టు వద్ద ఎస్సై ప్రశాంత్, సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో నీల్వాయి రేంజర్‌కు గాయాలు


నుజ్జునుజ్జయిన కారు

కోటపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): నీల్వాయి రేంజర్ అప్పలకొండ బుధవారం నీల్వాయి నుంచి చెన్నూరుకు వెళ్తుండగా కోటపల్లి-చెన్నూరు మార్గంలోని అటవీ ప్రాంతంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో ఆయన స్వల్ప గాయాలయ్యాయి. కారును రేంజర్ అప్పలకొండ డ్రైవింగ్ చేస్తూ వెళ్తుండగా ఆకస్మాత్తుగా అదుపు తప్పి పాలవాగు సమీపంలోని చెట్టును ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగంగా నుజ్జునుజ్జు కాగా ఆయన ప్రాణాలతో బయటపడ్డారు. ఆయనను ప్రాథమిక చికిత్స నిమిత్తం మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలించారు.

కుష్టు వ్యాధిరహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి

దహెగాం, మే 14 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధిరహిత సమాజ స్థాపనకు ప్రతీ ఒక్కరు కృషిచేయాలని రాష్ట్ర కుష్టు వ్యాధి బృందం సభ్యులు అన్నారు. బుధవారం దహెగాం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. కుష్టు వ్యాధిని ప్రాథమికదశలో గుర్తించి వైద్యులు ఇచ్చిన మాత్రలను వేసుకోవాలన్నారు. వ్యాధి సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. వ్యాధి నిర్మూలనకు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర బృందం సభ్యులు డీపీఎంవో వెంకటేశ్వరచారి, శ్రీనివాస్‌రెడ్డి, అరణం, సురేందర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలను అడ్డుకున్న అటవీ అధికారులు


ఇంటి నిర్మాణాలను అడ్డుకుంటున్న అటవీ అధికారులు

బెజ్జూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుస్మీర్ గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను అటవీ అధికారులు అడ్డుకున్నారు. గ్రామంలో ఇటీవల మొదటి విడతగా 22 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా వారంతా పునాదులు తవ్వి నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. సుస్మీర్ గ్రామం రిజర్వు ఫారెస్టులో ఉందని ఇంటి నిర్మాణాలను నిర్మించవద్దని ఇప్పటికే నోటీసులు జారీ చేసినప్పటికీ నిర్మాణాలు కొనసాగిస్తుండడంతో అటవీ అధికారులు అడ్డుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లను ఎవరు కూడా నిర్మించవద్దని అధికారులు తెలిపారు. బీట్ అధికారులు వెంకటేష్, అనిల్ గ్రామానికి వెళ్లి ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోవడంతో ఇరుపక్షాల మధ్య కొద్ది సేపు వాగ్వాదం జరిగింది. ఎన్నో ఏళ్ల నుంచి గ్రామంలో నివసిస్తున్నామని ఇప్పుడు ఎందుకు నిబంధనలు పెడుతున్నారని అధికారుల తీరుపై మండిపడ్డారు. తాము ఇక్కడే ఇంటి నిర్మాణాలను చేపడతామని అధికారులు ఎట్లా అడ్డుకుంటారో చూస్తామని హెచ్చరించారు. దశాబ్దాలుగా నివసిస్తున్న తమకు అటవీ అధికారులు నిబంధనలు పెడితే సహించేది లేదని హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

జైనూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనదారులు లైసెన్సులు, బండి కాగితాలను పరిశీలించారు. అనంతరం ఎస్ఐ రవికుమార్ మాట్లాడు తు మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. అతి వేగంగా అజాగ్రత్తగా వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. లైసెన్సులు లేనివారిని ఉపేక్షించేది లేదని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాత్రి వేళల్లో బయట తిరదివద్దని సూచించారు.

గ్రామశివారులో ఎలుగుబంటి సంచారం

భయాందోళనలో ప్రజలు


జువ్విగూడ గ్రామశివారులో సంచరిస్తున్న ఎలుగుబంటి

జన్నారం, మే 14 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం గ్రామ సమీపంలోని జువ్విగూడ, సబ్ స్టేషన్ ప్రాంతంలో రోజు సాయంకాలం ఎలుగుబంటి సంచరిస్తోంది. అటువైపుగా వెళ్తున్న వాహనదారులు గ్రామ శివారులోకి వచ్చిన ఎలుగుబంటిని వీడియోలు తీసి సోషల్‌మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది. దీంతో గ్రామ శివారులోని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. సబ్‌స్టేషన్‌తో పాటు అటవీ ప్రాంత సరిహద్దు గ్రామ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి అయితే బయటకు వెళ్లాలంటే భయంగా ఉందని వాపోతున్నారు. అటవీశాఖ అధికారులు చుట్టు కంచె ఏర్పాటు చేయాలని కోరారు.

సింగరేణి సమాచారం

కార్మికుల పిల్లల విద్యాభివృద్ధికి పెద్దపీట



లోగో ఆవిష్కరిస్తున్న సీఎండీ బలరాం

మందమర్రిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి పాఠశాల్లో చదువుతున్న కార్మికుల పిల్లల విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని సింగరేణి సీఎండీ బలరాం తెలిపారు. పట్టణం లోని సింగరేణి ఉన్నత పాఠశాల 50 సంవత్సరాల లోగోను ఆయన బుధవారం హైద్రాబాద్‌లోని సీఎండీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ 1975లో జూన్ నెలలో మంద మర్రిలో సింగరేణి పాఠశాల ప్రారంభమైందని, జూన్‌లో 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని తెలిపారు. ఈ పాఠశాలలో సుమారు 40 వేల మందికిపైగా విద్యార్థులు విద్యనభ్యసించి వివిధ దేశాల్లో ఉన్నతస్థాయిలో ఉన్నారని, సింగరేణిలో ఉన్నతాదికారులుగా సేవలందిస్తున్నారన్నారు. పాఠశాల 50 వసంతాల వేడుకలకు తాను తప్పకుండా హాజరవుతానని తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సునీల్‌కుమార్, మందమర్రి పాఠశాల కరెస్పాండెంట్ శ్యాంసుందర్, హెడ్మాస్టర్ పురుషోత్తం పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

శ్రీరాంపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): జీఎం కార్యాలయంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఏఐటీయూసీ నాయకులు పిట్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఓటు జీఎం సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, జీఎం కార్యాలయ సిబ్బందికి సంబంధించిన పర్సనల్ ఫైళ్లు వేర్వేరుగా ఉన్నందున ఒకచోట ఉంచి, వెల్ఫేర్, పే షీట్ చేసే పనులను ఒక ప్రత్యేక క్లర్కుకు అప్పగించాలని కోరారు. జనరల్ అసిస్టెంట్ సిబ్బంది సీట్లు కేటాయించవద్దన్నారు. పార్కింగ్ షెడ్డులో జీఎం కార్యాలయ సిబ్బంది వాహనాలు మాత్రమే పార్కు చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అటవీ విభాగంలో తగిన క్లరికల్ సిబ్బందిని, సూపర్‌వైజర్‌ను నియమించాలని, మైసమ్మతల్లి ఆలయంలో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో 6 మెన్ కమిటీ సభ్యుడు రాంచందర్, పిట్ కార్యదర్శి సందీప్ కుమార్, సహాయ కార్యదర్శి సంధ్య, సభ్యులు పూజిత, రామకృష్ణ, గోపాల్, మహేష్, సాయి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

నూతన గనులతోనే సింగరేణికి భవిష్యత్తు

- చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ మనుగడ నూతన గనుల ఏర్పాటుతోనే సాధ్యమని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. బుధవారం మందమర్రిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఐదు నుంచి ఆరు దశాబ్దాల క్రితం ప్రారంభించిన గనుల్లో బొగ్గు నిక్షేపాలు తగ్గడంతో మూతపడే దిశలో ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో సింగరేణికి భవిష్యత్ ఉండాలన్నా, ఉపాధి అవకాశాలు దొరకాలన్నా కేవలం నూతన గనుల వల్లనే సాధ్యమవుతుందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాటల్లో పాల్గొనవద్దని చెప్పడంతో గనుల వేలం పాటలో సింగరేణి యాజమాన్యం పాల్గొనలేదన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో యాక్షన్ ప్లాన్‌తోనే గనులను తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి సంస్థపై తీసుకున్న నిర్ణయాలు సంస్థకు తీరని నష్టాన్ని మిగిల్చాయన్నారు. దీని వల్లనే కొత్త గనులు రాకుండా పోయాయన్నారు. రాష్ట్రంలో అపారమైన బొగ్గు నిక్షేపాలు ఉన్నాయన్నారు. చెన్నూరు నియోజకవర్గంలోని గోదావరి పరివాహక ప్రాంతంలో అపారమైన బొగ్గు సంపద ఉందన్నారు. గత దశాబ్దం క్రితం చెన్నూరు పట్టణంలో ప్రారంభించిన 1, 2 గనులను ఓపెన్‌కాస్టుగా చేయాలని తాను సింగరేణి సీఎండీకి విన్నవించినట్లు తెలిపారు. త్వరలోనే సీఎంను కలిసి బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల్లో నూతన గనులకు సంబంధించిన నివేదికలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మందమర్రిలో కేకే 6తో పాటు బెల్లంపల్లి, మందమర్రి సరిహద్దులో ఉన్న శ్రావణపల్లి ప్రాజెక్టు అంశాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకు లు నోముల ఉపేందర్‌గౌడ్, మంద తిరుమల్, రాచర్ల గణేష్, నర్సింగ్, లక్ష్మణ్, దేవుడు, సజ్జు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న బాజీసైదా

శ్రీరాంపూర్, మే 14(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు భాగస్వాములు కావాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కోరారు. ఎస్ఆర్‌పీ-3 గనిపై జరిగిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నిర్వహించే ఒక్క రోజు టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, పిట్ కార్యదర్శి మురళీచౌదరి, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షడు జె. శంకర్ రావు, సీఐటీయూ ఉప ప్రధానకార్యదర్శి నాగరాజు గోపాల్, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కె. సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాసిపేట (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న నిర్వహించతలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి జేఏసీ ఆధ్వర్యంలో పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకుడు దాగాం మల్లేశ్ ఐఎన్‌టీయుసీ కేంద్ర కమిటీ ప్రచార కార్యదర్శి బన్న లక్ష్మణ్‌దాసు, సీఐటీయూ వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, టీబీజీకేఎస్ పిట్ సెక్రెటరీ బైరీ శంకర్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమ్మెకు దూరంగా ఉండండి: జీఎం

శ్రీరాంపూర్, మే 14(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు సమ్మెకు దూరంగా ఉండాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. జీఎం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్మిక సంఘాలు ఈ నెల 20వ సమ్మె చేయాలని పిలుపునిచ్చాయని తెలిపారు. కానీ ఆయా డిమాండ్లలో చాలా మటుకు సింగరేణి కార్మికులకు సంబంధించినవి కావని పేర్కొన్నారు. యాజమాన్యం కూడా తీర్చగలిగినవికావన్నారు. ఎలాంటి సమస్యలున్నా కార్మికులు యాజమాన్యంతో చర్చించి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. వివిధ కారణాల వల్ల ఓబీ తొలగింపు, బొగ్గు ఉత్పత్తిలో వెనుకబడి ఉన్నామన్నారు. బొగ్గు లేకపోతే విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోతుందన్నారు. ఒక్క రోజు సమ్మెతో కంపెనీకి 76 కోట్ల రూపాయల నష్టం జరుగుతుందని, కార్మికులు 13.07 కోట్ల రూపాయల వేతనాలు కోల్పోతారని, 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నష్టపోతామని తెలిపారు. ఆయా విషయాలను పరిగణలోకి తీసుకొని ఈ నెల 20వ తేదీన నిర్వహించే సమ్మెకు దూరంగా ఉండాలని కార్మికులను కోరారు. సమావేశంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఎస్ఈ(ఐఈడీ) కిరణ్‌కుమార్, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

రక్షణ, ఉత్పత్తిపై ప్రత్యేక శ్రద్ధ చేపట్టాలి: జీఎం

శ్రీరాంపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఏరియా ఉద్యోగులు రక్షణ, ఉత్పత్తిపై ప్రత్యేక శ్రద్ధ చేపట్టాలని జీఎం ఎం. శ్రీనివాస్ సూచించారు. బుధవారం ఆయన ఏరియాలోని వివిధ గనులకు చెందిన అధికారుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్కే 6, ఆర్కే న్యూటెక్ గనులకు 5 స్టార్ రేటింగ్ రావడం ఆనందంగా ఉందన్నారు. ఇది ఉద్యోగుల సమష్టి కృషి అని ఆయన కొనియాడారు.

భూగర్భ, ఉపరితల గనుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తప్పనిసరిగా రక్షణ నియమాలు పాటిస్తూ, వ్యక్తిగత రక్షణ పరికరాలను ధరించాలని సూచించారు. పని ప్రదేశాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏజీఎం (ఫైనాన్స్) బీభత్స, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఓసీపీల పీఓలు టి. శ్రీనివాస్, ఏవీ రెడ్డి, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, డీజీఎం(పర్సనల్) పి. అరవిందరావు, డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి నది పుష్కరాల వద్ద సేవా స్టాల్స్

రెబ్బెన, మే 14 (ఆంధ్రజ్యోతి): సరస్వతి నది పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం వద్ద సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్టు అధికార ప్రతినిధి(పర్సనల్ మేనేజర్)రెడ్డిమల్ల తిరుపతి బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సింగరేణి సేవా సమితి ద్వారా శిక్షణ పొందిన మహిళలు తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు మంచి అవకాశం ఉందని తెలిపారు.

దీని ద్వారా సింగరేణి సేవా సమితి ఖ్యాతిని మరింతగా ఇనుమడింప చేసేందుకు సేవా సభ్యులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు సింగరేణి సేవా సమితి సమన్వయ కర్త మొబైల్ నంబర్ 9951214116లో సంప్రదించాలని తిరుపతి సూచించారు.

ఇంటర్ వార్షిక ఫలితాల్లో ముందంజలో ఉండాలి

కలెక్టర్ కుమార్ దీపక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ వార్షిక ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలోనే ముందంజలో ఉండే విధంగా మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో బుధవారం జిల్లా అధికారులతో ఇంటర్మీడియంట్ విద్యపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ విద్యను మరింత బలోపేతం చేసే దిశగా అధికారులు సమన్వయంగా కృషి చేయాలని సూచించారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన వారికి సరైన మార్గదర్శనం చేయాలన్నారు. జూనియర్ కళాశాలతో పాటు ఐటీఐ ఇతర రంగాల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలన్నారు. జూనియర్ కళావాలలతో పాటు ఐటీఐలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలన్నారు. కళాశాల్లో విద్యార్థుల హాజరు శాతం పెంపొందించాలన్నారు. జిల్లాలోని కోటపల్లి, జైపూర్, దండేపల్లి, తాండూరు మండలాల్లో నూతన వసతి గృహాలు మంజూరు అయ్యాయన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థుల సమయానుకూలంగా బస్సులు నడిపించాలన్నారు. విద్యార్థులు కళాశాల్లో చేర్పించేందుకు సంబంధిత అధికారులు, అధ్యాపకుల బృందం సమష్టిగా కృషి చేయాలన్నారు. మంచిర్యాల, మందమర్రి, కాసిపేట, చెన్నూరు, బెల్లంపల్లి, (బాలుర-బాలికల), జైపూర్, జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట, లల్లో ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో లక్ష 77 రూపాయల వ్యయంతో 95 అగ్ని నిరోధక వ్యవస్థలను ఏర్పాటు చేస్తామన్నారు. వసతి గృహాల ఏర్పాటుకు సంబంధించిన అధికారులు ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



లబ్ధిదారులతో ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఆర్డీవో

బెల్లంపల్లి, మే14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తుందని ప్రతి ఒక్కరు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు వర్తిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి రహదారుల మరమ్మతుల కోసం ప్రత్యేక నిధులను కేటాయిస్తూ కృషి చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ మరోవైపు అభివృద్ధి పరుస్తూ ప్రజా మన్ననలు పొందుతున్న ప్రభుత్వం కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో హరిక్రిష్ణ, తహసీల్దార్ జ్యోత్స్న పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

భీమిని, మే 14 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రత నియమాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పెద్దపేట గ్రామంలో రవాణా శాఖ అధికారులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధృవీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ధరించాలని సూచించారు. అలాగే అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విలేజ్ పోలీస్ ఆఫీసర్ దీపిక, హెడ్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డి, సోసల్ వర్కర్ వసంత్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



రైతు శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న కేవీకే సైంటిస్ట్ శివరామక్రిష్ణ

హాజీపూర్, మే14(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం వారి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో కార్యక్రమం బుధవారం హాజీపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరి పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కోట శివరామకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి కల్పన పాల్గొన్నారు. శివరామకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులు తక్కువ యూరియా వాడకం, సాగును తగ్గించడంతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ అధికారి కల్పన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫార్మర్ ఐడి కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. ఎఫ్‌టీవో డైరెక్టర్ శ్రీనివాసరావు, శంకర్, లక్ష్మణ్, సత్తయ్య, బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్ర వేత్తలు డాక్టర్ తిరుపతి, డాక్టర్ స్రవంతి, హాజీపూర్ ఏవో క్రిష్ణ, ఉద్యావన శాఖ అధికారులు సహజ, ప్రసన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు షీటీంపై అవగాహన సదస్సు

నస్పూర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బుధవారం సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులకు షీటీం, భరోసా కేంద్రం సభ్యులు వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు, ఆకతాయిల ఆటకట్టించి మహిళలకు రక్షణ కల్పించే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎక్కడైన మహిళలను వేదింపులకు గురి చేస్తే ఫిర్యాదు చేయాలనుకుంటే 6303923700 నంబరుకు సంప్రదించాలని సూచించారు. అత్యవసర సమయంలో 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. ఈ సదస్సులో షీటీం సభ్యులు శ్రావణ్, జ్యోతి, భరోసా సెంటర్ సభ్యులు, ప్రిన్సిపాల్ మౌనిక పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దండేపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన తాళ్లపేట గ్రామానికి చెందిన జాడి రాజం కుటుంబానికి బుధవారం మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్ రూ, 5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుర్సెంగ కళావతి, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, నాయకులు దయాకర్, దావూద్‌ఖాన్, మల్లేష్ పాల్గొన్నారు.

తెరపైకి పోడు లొల్లి



- హక్కుపత్రాలు లేని భూమి సాగు చేయొద్దని అటవీ అధికారుల హెచ్చరికలు
- ఆందోళనలో రైతులు

కాసిపేట, మే14 (ఆంధ్రజ్యోతి): పోడు భూముల వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. వారం రోజులుగా అట వీశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతుల వద్దకు వెళ్లి భూమి హక్కు పత్రాలు లేని రైతులు ఎవరు కూడ భూములు సాగు చేయవద్దని నచ్చజెప్పే ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో బాధిత రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అటవీ హక్కుల చట్టాన్ని అనుసరించి 2005 డిసెంబరు 13 తేదీలోపల పోడు భూములను సాగు చేసుకుంటున్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో మంచిర్యాల జిల్లా నుంచి 11, 774 మంది రైతులు 33, 417 ఎకరాల భూమికి దరఖాస్తులు చేసుకున్నారు కానీ ఆర్ఓఎఫ్ఆర్ ద్వారా కేవలం 1940 మంది రైతులకు సుమారు 4600 పైచిలుకు ఎకరాల భూమికి హక్కు పత్రాలు అధికారులు అం దజేశారు. దీంతో హక్కు పత్రాలు లేని రైతుల వద్ద నుంచి మిగులు భూమిని అటవీ శాఖ స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా వారం రోజుల నుంచి గ్రామాల్లో పోడు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో 472 కేసులు

అటవీ నిబంధనలు అతిక్రమించిన పోడు రైతులపై 472 కేసులు నమోదైనట్లు అటవీశాఖ అధికారులు వెల్లడించారు. అర్హత ఉన్న రైతులకు అటవీ హక్కుల నిబంధనలను అనుసరించి భూమి హక్కు పత్రాలు ఇచ్చారు. మిగులు భూమి అంతా అటవీశాఖకు సంబంధించే కాబట్టి నిబంధనలకు విరుద్ధంగా ఎవరు కూడా సాగు చేయవద్దని అటవీశాఖ అధికారులు హుకుం జారీ చేశారు. దీంతో తరాలను నుంచి సాగు చేస్తున్న భూములను అటవీశాఖ అక్రమంగా లాక్కొనే ప్రయత్నం చేస్తుందని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. పోడు వ్యవ సాయం ద్వారా అడవుల విస్తీర్ణం తగ్గిపోతుంది. ఎలాంటి హక్కు పత్రాలు లేని భూములను అటవీశాఖ ద్వారా భూములను స్వాధీనం చేసుకొని సామాజిక అడవుల విస్తీర్ణం పెంచేందుకు అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. దండేపల్లి మండలం కోయపోచంగూడెంపై అటవీశాఖ అధికారులు చేసిన దాడులు జాతీయ స్థాయిలో తీవ్ర సంచలనం రేపాయి. ప్రభుత్వం మళ్లీ పోడుభూముల వ్యవహారాన్ని తెరపైకి తేవడంతో పోడు రైతుల్లో ఆందోళన మొదలైంది.

సాగులో ఉన్న పోడు రైతులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలి...

ఎర్ర పున్నం, తెలంగాణ ఆదివాసీ గిరిజన జిల్లా కార్యదర్శి



పోడు భూముల్లో సాగులో ఉన్న ప్రతి రైతుకు భూమి హక్కు పత్రాలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి. అలాగే జిల్లాలోని మండలాల ను, గ్రామాలను పోడు మండలాలుగా గుర్తించి అటవీహక్కుల చట్టాన్ని అమలు చేసి, పోడు రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తి వేయాలి. గిరిజనుల సాగు భూముల నుంచి రైతులను వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఆదివాసీ గూడాల్లో భయం సృష్టించే విధంగా అధికారుల వ్యవహరించడం మానుకోవాలి. అందరికీ న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

అనధికారికంగా అటవీ భూములను సాగు చేయరాదు..

శివ్ ఆశీశ్‌సింగ్, డీఎఫ్‌వో మంచిర్యాల

పోడు వ్యవసాయం పేరుతో అడవులను ధ్వంసం చేయవద్దు. అలాగే అనాధికారికంగా అటవీ భూముల్లో రైతులు ఎవరు కూడా సాగు చేయరాదు. అటవీశాఖ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

29 నుంచి రైతు వద్దకు శాస్త్రవేత్తలు

బెల్లంపల్లి, మే14(ఆంధ్రజ్యోతి): ఈనెల 29 నుంచి జూన్ 12 వరకు రైతు వద్దకు శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివక్రిష్ణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రయోగశాల నుంచి భూమికి మిషన్‌లో భాగంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లో పర్యటించి రైతులతో భేటి అవుతూ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తామన్నారు. భూసార పరీక్షలు ఆధునిక వ్యవ సాయ పద్ధతులు, వ్యవసాయంపై సాంకేతికత యాంత్రీకరణ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

అటవీ భూమిని సాగు చేస్తే కఠిన చర్యలు

తాండూర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : చట్ట విరుద్ధంగా అటవీ భూమిని సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సువర్ణ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని ప్రజలతో సమావేశం నిర్వహించారు. వ్యవసాయ పేరుతో పోడు చట్టాలకు విరుద్ధంగా అటవీ భూములు సాగు చేసే వారిపై చర్యలు ఉంటాయన్నారు. అటవీ భూమి హక్కు పత్రం ఉంటేనే సాగు చేసుకోవాలని, చట్టబద్ధంగా గుర్తించే ఒక పత్రం అటవీ హక్కుల చట్టం ప్రకారం జారీ చేయబడుతుందన్నారు. హక్కు పత్రాలు లేని వారు అటవీ భూములను సాగు చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు బీట్ ఆఫీసర్ గోపికృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

బెల్లంపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి బస్తీకి చెందిన ఆయిళ్ల పోసు (60) అనే వృద్ధురాలు జీవితంపై విరక్తి చెంది బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. పోసు మూడు నెలల క్రితం పక్షవాతం రావడంతో చికిత్స తీసుకున్నా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది బెల్లంపల్లి బస్తీలోని పోచమ్మ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. భర్త పోశం పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పంటల బీమా ఊసేది...?

(5వ పేజీ తరువాయి)

ప్రీమియం నిర్ధారణ కోసం రాష్ట్రస్థాయిలో అధికారులు చర్చలతోనే సరిపె ట్టారు. పంటల బీమాకు సంబంధించి కేంద్ర పథకం ఫసల్ బీమా యోజన రాష్ట్రంలో ఇంకా అమల్లోకి రానందున రాష్ట్ర బడ్జెట్ నుంచే నష్టపరిహారం ఇవ్వాలని సర్కారు నిర్ణయించింది. అయిన ఇప్పటివరకు ఆచరణకు నోచుకోలేదు. ఈ యాసంగి సీజన్‌లో అకాల వర్షంతో జిల్లాలో వేల ఎకరాల్లో పంట నష్టం జరుగగా, నివేదికను అధికారులు ప్రభుత్వానికి అందజేశారు.

యూనిఫైడ్ ప్యాకేజీ అమలుకు..

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బీమా తక్షణ అమలుతో పాటు కేంద్ర ప్రభుత్వ యూనిఫైడ్ ప్యాకేజీ పథకాన్ని అమలు చేయాలని అన్నదాతలు అభ్యర్థిస్తున్నారు. యూనిఫైడ్ ప్యాకేజీ వల్ల పంటల బీమా చేసిన రైతు ప్రమాదవశాత్తు మరణించిన సందర్భంలో అతని కుటుంబానికి రూ. 2 లక్షల పరిహారం, శాశ్వత అంగవైకల్యం పొందితే రూ.రెండు లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ. లక్ష పరిహారంగా చెల్లిస్తారు. కుటుంబ పెద్ద మరణించినప్పుడు చదువు కుంటున్న అతని పిల్లలకు ఆర్థిక సాయం అందించడం, ఇళ్ల నష్టపోయినా, ట్రాక్టర్, పంపుసెట్‌కు నష్టం వాటిల్లినా బీమా పరిహారాన్ని మంజూరు చేస్తారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో వానాకాలం సీజన్‌లో సాగయ్యే పంటలకు సర్వే నెంబర్ల లేదా కమతం వారీగా పంటల బీమా అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పత్తాలేని రూ.10 వేల పరిహారం..?

అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగండ్లతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ అది కూడా అమలుకు నోచుకోవడం లేదు. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల కారణంగా కల్లాల్లో వేలాది ఎకరాల ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. మామిడి తోటలు అక్కరకు రాకుండా పోయాయి. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంటల బీమా అమలులో లేకపోవడంతో నష్ట పరిహారం అందే పరిస్థితి లేదు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తానన్న ఎకరాకు రూ. 10 వేల నష్ట పరిహారం కూడా రెండేళ్లుగా అందడం లేదు. దీంతో రైతులు రెండు విధాలుగా నష్టపోతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

దండేపల్లి. మే 14(ఆంధ్రజ్యోతి): ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించా లని దండేపల్లి ఎస్సై ఎండి తహసినోద్దీన్ హెచ్చరించారు. దండేపల్లి మండల తాళ్లపేటలో బుధవారం రోడ్డు భద్రతపై వాహనదారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ ప్రతి వాహనదారులు రోడ్డు భద్రత, నియమని బంధనాలను తప్పకుండా పాటించాలని సూచించారు. ప్రతి ద్విచక్ర వాహనదారు లందరూ తప్పని సరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే వారి పై కఠిన చర్యలు తప్పవన్నారువాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఎవరైన చట్టాలను ఉల్లఘించిన వారిపై కఠన చర్యలతో పాటు కేసు నమోదు చేస్తామన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులను సద్వినియోగం చేసుకోవాలి

కన్నెపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి) : కల్యాణలక్ష్మి చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రావణ్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు అన్నారు. మండలంలోని జన్కాపూర్ గ్రామానికి చెందిన ఏల్పుల సుస్మిత, నాయకునిపేటకు చెందిన గాదె అనూషకు బుధవారం తహసీల్దార్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రోహిత్ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా ఆశన్న

కన్నెపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి) : కన్నెపల్లి మండల నూతన బీజేపీ అధ్యక్షుడిగా షైదం ఆశన్న నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ బుధవారం జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటకృష్ణ, బేరె రామన్నయాదవ్, సాయిపటేల్ పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

పక్క రాష్ట్రం ధాన్యం కొంటే కేసులు నమోదు చేస్తాం

కోటపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి) : పక్కన ఉన్న మహారాష్ట్ర నుంచి వచ్చే ధాన్యాన్ని కొనుగోలు చేస్తే కొనుగోలు కేంద్రాల నిర్వహకులపై కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ రాఘవేంద్రరావు హెచ్చరించారు. బుధవారం మండలంలోని కొల్లూరు, దేవులవాడ, రాపన్‌పల్లి గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. వర్ష సూచనలు ఉన్నందున ధాన్యాన్ని వెంటనే సెంటర్లకు తరలించాలని రైతులను కోరారు. అలాగే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యాన్ని వెంటనే కాంటా చేసి లారీల్లో లోడు చేసి రైసు మిల్లులకు పంపించాలని ఆదేశించారు. ఏదైనా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే ప్రభుత్వం చేపట్టే క్రిమినల్ చర్యలకు బాధ్యులు అవుతారని, ఎవరైనా మహారాష్ట్ర నుంచి వడ్లు తీసుకువచ్చినట్లు అయితే నిర్వాహకులపై కేసు బుక్ అవుతుందని పేర్కొన్నారు.

-లారీని వెనక్కి పంపిన అధికారులు

జాతీయ రహదారిపై పారుపెల్లి వద్ద ఉన్న ధాన్యం తనిఖీ కేంద్రం వద్ద మహారాష్ట్ర నుంచి ఇటు వైపు ధాన్యం తీసుకువస్తుండగా తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎస్ఐ రాజేందర్‌లు పట్టుకున్నారు. డ్రైవర్ ద్వారా వివరాలు తెలుసుకుని లారీని తిరిగి మహారాష్ట్రకు పంపించారు. చెక్‌పోస్టులో సిబ్బందికి సూచనలు ఇస్తూ ధాన్యం సరఫరాపై నిరంతర నిఘా పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి సాయికృష్ణ, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాఘవేంద్రరావు

ప్రతీ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తాం

భీమారం, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నా రు. బుధవారం మండలంలోని బూరుగుపల్లి నుంచి దాంపూర్ వరకు సీఆర్ఆర్ నిధులు రూ. 335 లక్షల నిధులతో బీడబ్ల్యూడీ బీటీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భీమారం మండలంలోని మారుమూల గ్రామాలకు సైతం రోడ్డు సౌకర్యం కల్పించి ప్రజల రవాణాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేడయమే తమ ధ్యేయమన్నారు. దాంపూర్, రెడ్డిపల్లి, ధర్మారం ప్రజలు నర్సింగాపూర్, కాజిపల్లి మీదుగా తిరిగి రావడంతో ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిచామన్నారు. మండలాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తిరుమల, నాయకులు పోడేటి రవి, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.



బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

అటు విజ్ఞానం... ఇటు వినోదం..

కోటపల్లిలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపు



యోగా తరగతుల్లో విద్యార్థులు

కోటపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎండలో తిరగకుండా, సెల్‌ఫోన్‌లు, టీవీలకు అతుక్కుపోకుండా ఉండేందుకు విద్యాశాఖ ఎంపిక చేసిన పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులు కొనసాగుతున్నాయి. ఇందులో విద్యార్థులకు పలు రకాల అంశాలపై శిక్షణ ఇస్తు న్నారు. జిల్లా వ్యాప్తంగా 50 పాఠశాలలు ఎంపిక చేయగా ఇందులో కోటపల్లి మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో సమ్మర్ క్యాంపు కొనసాగుతోంది. ఈ నెల 2 నుంచి ప్రారంభమైన సమ్మర్ క్యాంపు ఈ నెల 16 న ముగియనుంది. కాగా క్యాంపుకు వస్తున్న విద్యార్థులు ఆడుతూ పాడుతూ వివిధ రకాల స్కిల్స్ నేర్చుకుంటూ ఉత్సాహంగా ఉల్లాసంగా గడుపుతున్నారు. దీంతో పాఠశాలల్లో సందడి నెలకొనగా విద్యార్థులకు ఓ వైపు విజ్ఞానం అందడంతో పాటు మరో వైపు వినోదాన్ని పంచుతున్నారు. శిబిరం ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు కొనసాగుతుండడం ఇందులో యోగా, మెడిటేషన్, డ్యాన్స్, చిత్రలేఖనం, ఇండోర్‌గేమ్స్ లాంటి అంశాలపై తర్ఫీదునిస్తున్నారు. ఇందుకోసం వలంటీర్లను నియమించగా పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ పర్యవేక్షిస్తున్నారు. మరో వైపు విద్యార్థులకు మెటీరియల్‌తో పాటు స్నాక్స్‌ను సైతం అందిస్తున్నారు. దీంతో వేసవిలో విద్యార్థులు బయట తిరగకుండా సమ్మర్ క్యాంపుకు హాజరవుతూ వివిధ అంశాలపై శిక్షణ పొందుతున్నారు. దీని వల్ల విద్యార్థులకు చదువుతోపాటు వివిధ రకాల స్కిల్స్‌పై ఆసక్తి పెరుగుతుంది. చిన్నారులను క్యాంపునకు పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడంతో ప్రతి రోజు విద్యార్థులు హాజరవుతూ శిక్షణ పొందుతున్నారు.

ఆట పాటలు బాగున్నాయి - ప్రేరణ, విద్యార్థిని



వేసవి క్యాంపులో ఆట, పాటలతో పాటు యోగా , చిత్రలేఖనం వంటి అంశాలు ఆసక్తిగా ఉన్నాయి. మరో వైపు డ్యాన్స్, ఇంగ్లీష్, గణితంలోని స్కిల్స్‌పై వివరిస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల గురించి అవగా హన కల్పించడం వల్ల మాలో సేవా భావం పెరుగుతుంది. మంచిగా చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిర పడడంతో పాటు సమాజ సేవలో తమ వంతుగా పాల్గొంటాం.

సిద్దిపేటలో లారీ బోల్తా పడి డ్రైవర్ మృతి

మల్కెపల్లిలో విషాదం

కాసిపేట, మే 14 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట సమీపంలో బుధవారం లారీ బోల్తా పడి కాసిపేట మండలం మల్కెపల్లికి చెందిన డ్రైవర్ వడ్లూరి రాకేష్ (26) అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో మల్కెపల్లిలో తీవ్ర విశాదం నెలకొంది. కుటుంబ సభ్యులు తెలిపన వివరాల ప్రకారం రాకేష్ మంగళవారం రాత్రి దేవాపూర్ నుంచి సిమెంట్ లోడ్‌తో హైదరాబాదుకు బల యలుదేరాడు. బుధవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి రోడ్డంతా చిత్తడిగా మారింది. దీంతో అదుపు తప్పిన లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో రాకేష్ అక్కడికక్కడే మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

మందమర్రిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మేదరి బస్తీకి చెందిన పిల్లి సంకీర్తన (17) బుధవారం అనారోగ్యంతో మృతిచెందింది. మూడు రోజుల క్రితం తీవ్ర కడుపు నొప్పి వస్తుందని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వెంటనే హైద్రాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందిందని కుటుంబీకులు తెలిపారు. కూతురు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సంక్తీరన ఇంటర్‌లో 973 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచింది. సంకీర్తన మృతితో ఆమెతో చదివిన తోటి విద్యార్థులు అంత్యక్రియలకు హాజరయ్యారు. సంకీర్తన మృతితో మేదరి బస్తీలో విషాదం అలుముకుంది. మృతురాలు తండ్రి పిల్లి సతీష్ స్థానిక జీఎం కార్యాలయంలోని లా డిపార్టుమెంట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. జీఎం కార్యాలయం సిబ్బంది కూడా అంత్యక్రియలకు హాజరయ్యారు.



సంకీర్తన (ఫైల్)

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

వాంకిడి, మే 14 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా ముథోల్ నియోజక వర్గం లోని రాళ్లబోరిగాంలో దళితులపై దాడి చేసిన అగ్రవర్ణాల గుండాలను కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దాడిని తీవ్రగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే దుండగలను పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, సందీప్, వినేష్, శ్యాంరావు, ప్రతాప్, రోషన్, బల్వంత్, పోచాలు, మనోజ్, చింటు, వివేక్, మారుతి, రమేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు న్యాయం చేయాలి



సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

పెంచికలపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): భూ భారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి దరఖాస్తులదారులకు న్యాయం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లాలోని పెంచికలపేట మండలం బొంబాయిగూడ, ఎల్కపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సును కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధశుక్లాతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టంలో నూతన ఆర్‌వోఆర్‌లో పొందుపరిచిన అంశాలపై అధికారులు, రైతులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పెంచికలపేట మండలాన్ని పైలెట్ మండలంగా ఎంపిక చేసుకొని 12 రోజుల నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుల్లో రైతులు తమ సమస్యలను నిర్ణీత నమునా ఫారంలో నింపి అందజేస్తున్నారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన జరిపి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణతో రైతులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను భూ భారతి చట్టంలోని అంశాలకు లోబడి దరఖాస్తులను పరిష్కరించాలని, ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా పనిచేయాలని సూచించారు. రైతుల సమస్యలను తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు.

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను డెస్క్ వర్క్ ద్వారా రెవెన్యూ రికార్డులతో దరఖాస్తులు గల వివరాలను సరిచూసి క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని ఆదేశించారు. సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తును రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఎల్కపల్లి వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్లు వెంకటేశ్వర్‌రావు, కవిత, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



- నర్సరీల్లో మొక్కలు సిద్ధం
- పకడ్బందీగా చేపట్టేందుకు అధికారుల ప్రణాళికలు
- జిల్లాలో 51 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం

ఆసిఫాబాద్: మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు.. 11వ విడతలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేశారు. వానలు కురవడమే అలస్యం.. మొక్కలు నాటేందుకు డీఆర్‌డీఏ, అటవీ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యలయాలు, ప్రైవేట్ సంస్థలు, పరి శ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్య శాలలు, కళాశాలలు, పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ప్రజలకు, రైతులు అడిగిన మొక్కలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు.

రాష్ట్రంలో పచ్చదనం పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగానే ఈఏడాది కూడా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కార్యచరణ రూపొందించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణకు హరితహారం పేరుతో తొమ్మిది విడతలుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గత ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పదో విడతలో వనమహోత్సవం పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ సారి 11 విడతలో వన మహోత్సవాన్ని ఉత్సహంగా నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో జిల్లా గ్రామీణాభివృద్ధి, అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో జూలై మొదటివారంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

● డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 40.50 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం

జిల్లాలో 11వ విడత వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 15 మండలాల్లోని 335 గ్రామపంచాయతీల్లో 51 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో అన్ని శాఖలను భాగస్వామ్యం చేయ నున్నారు. ఈసారి డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 40,53,500 మొక్క లను నాటాలని లక్ష్యంగా నిర్దేశిం చుకుంది. అలాగే అటవీశాఖ, ఇతర శాఖల ఆధ్వర్యంలో మిగితా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

● 335 నర్సరీల్లో మొక్కల పెంపకం:

జిల్లా గ్రామీణాభివృది శాఖ ఆధ్వర్యంలో 335 గ్రామ పంచాయతీల్లో పంచాయతికి ఒకటి చొప్పున మొత్తం 335 నర్సరీలలో 40,53,500 మొక్కలు పెంచుతు న్నారు. జిల్లాలో మండలాల వారీగా నర్సరీల్లో పెంచుతున్న మొక్కల వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం	జీపీలు (నర్సరీలు)	మొక్కల పెంపకం (లక్షల్లో)
ఆసిఫాబాద్	27	3,26,700
రెబ్బెన	24	2,90,400
తిర్యాణి	29	3,50,900
వాంకిడి	2	3,38,800
కాగజ్‌నగర్	28	3,38,800
కౌటాల	20	2,42,000
సిర్పూర్(టి)	16	1,93,600
బెజ్జూరు	22	2,66,200
చింతలమానేపల్లి	19	2,29,900
దహెగాం	24	2,90,400
పెంచికల్‌పేట	12	1,45,200
జైనూరు	26	3,14,600
కెరమెరి	31	3,75,100
లింగాపూర్	14	1,69,400
సిర్పూర్(యూ)	15	1,81,500
మొత్తం	335	40,53,500

సమ్మర్ క్యాంపు పరిశీలన

వాంకిడి, మే 14(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో జరుగుతున్న సమ్మర్ క్యాంపును డీఈవో బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గణితం, స్పోకెన్ ఇంగ్లీష్, యోగా, డ్యాన్స్ కంప్యూటర్, చిత్రలేఖనం తదితర అంశా లను పరిశీలించారు. సమ్మర్ క్యాంపు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీపీఐ మండల మహాసభను జయప్రదం చేయండి

ఆసిఫాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న ఆసిఫాబాద్ మండల కేంద్రంలో జరిగే సీపీఐ మండల మహాసభను విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు చిరంజీవి కోరారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని సందీప్‌నగర్-1, 2 శాఖ మహాసభలను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దివాకర్,, దోన్నాజీ, సిద్దక్క, భాస్కర్, మహేష్, సంతోష్, షబ్బీర్, సుధాకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డుల పరిశీలన

కెరమెరి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోయగాం గ్రామపంచాయతీ కార్యాలయంలో డీపీవో భిక్షపతిగౌడ్ రికార్డులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన జనన, మరణ ధ్రువీకరణ రిజిస్టర్లు, శానిటేషన్ డిమాండ్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. జూన్ నెలలో నిర్వహించనున్న వన మహోత్సవానికి నర్సరీలలో మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట కార్యదర్శి బొజ్జిరావు ఉన్నారు.

చదువుతోనే అభివృద్ధి సాధ్యం

సిర్పూర్(యు), మే 14 (ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధి చదువుతోనే సాధ్యం అవుతుందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రెసిడెంట్‌గూడలో ఐదు రోజులుగా కొనసాగుతున్న పెర్సా పెన్ ఉత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా భగవంత్‌రావు, ఆత్రం వంశీయుల గురువు కటోడ ఆత్రం లింబారావు మాట్లాడుతూ ఆదివాసీ సమాజం అభివృద్ధి చెందాలంటే చదువపై శ్రద్ధ పెట్టాలన్నారు. కటోడ ఆత్రం భీంరావు,ఆత్రం జ్యోతిరాం పటేల్,ఆత్రం నేహరా పటేల్,ఆత్రం శ్రీరావు రాజా,ఆత్రం కుషంరావు,ఆత్రం లక్ష్మన్,దుర్వా మోతి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



బాబేఝరిలో బావిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కెరమెరి, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని బాబేఝరి, శివగూడ గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొన్న సందర్భంగా బుధవారం ఆయా గ్రామాల్లో మంచినీటి వనరులను పరిశీలించారు. అక్కడ ఎండి పోయిన బావిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి ఎండి పోతున్నాయని వాటిలో పూడిక తొలగించాలని ఆర్‌డబ్ల్యూఎస్, ఈజీఎస్ అధికారులను ఆదేశించారు. లేని పక్షంలో వాటర్ ట్యాంకర్ ద్వారా మంచినీటి అందజేయాలన్నారు. ఎండి పోయిన బావి వద్ద కమ్యూనిటీ సోక్‌పిట్, ఇంకుడు గుంతలు నిర్మించాలని ఏపీఓను ఆదేశించారు. అలాగే మండల కేంద్రంలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. అంతకు ముందు మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తు ఫారాలను పరిశీలించారు. త్వరగా ప్రాసెస్ పూర్తి చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. అనంతరం బాబేఝరి, శివగూడ గ్రామంలోని నీటి ట్యాంకును పరిశీలించారు. గ్రామాల్లో మురికి కుంటల చివరి పాయింట్ వద్ద సామాజిక ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట డీపీవో భిక్షపతిగౌడ్, మండల ప్రత్యేకాధికారి వెంకట్, ఎంపీడీవో అంజద్‌పాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సిద్దిఖి, ఏఈ విశ్వేశ్వర్, ఏపీఓ మల్లయ్య తదితరులు ఉన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం



పెంచికలపేటలో తడిసిన ధాన్యం

పెంచికలపేట(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తం గా బుధవారం ఉదయం మోస్తారు వర్షం కురిసింది. ఈ వర్షంతో ఎండల తీవ్రత నుంచి ఉపశమనం కలిగింది. పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు బురదమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసి పోకుండా టార్పాలీన్‌లు కప్పడానికి రైతుల నానా పాట్లు పడ్డారు. అయినా కొంత మేరకు ధాన్యం కొట్టుకుపోయింది.

బెజ్జూరు (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలో బుధవారం ఉదయం భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా ఎండలు దంచి కొట్టడంతో ఎండల తీవ్రతకు ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు కురిసిన వర్షం చల్లదనాన్ని ఇచ్చింది. కాగా కురిసిన వర్షం కారణంగా పంటలకు ఎలాంటి న్టం లేకున్నప్పటికీ ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఊరట కలిగింది. పంట చేలు దుక్కులు దున్నేందుకు ప్రయోజనం కలుగుతుంద ని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



బెజ్జూరులో కురుస్తున్న వర్షం

డ్వాక్రా భవనంలో గ్రంథాలయం ఏర్పాటు వద్దు



ఐకేపీ భవనం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

కౌటాల, మే 14 (ఆంధ్రజ్యోతి): పాత ఐకేపీ భవనాన్ని గ్రంథాలయంగా మార్చవద్దని మహిళా సంఘాల నాయకులు బుధవారం ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయాన్ని ఇటీవల రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ అహ్మద్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పరిశీలించారు. గ్రంథాలయ భవనం శిథిలా వస్థకు చేరడంతో ప్రధాన రహదారిపై గల పాత ఐకేపీ భవనాన్ని గ్రంథాల యంగా మార్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఐకేపీ భవనాన్ని గ్రంథాలయానికి ఇచ్చేందు కు మహిళా సంఘాలు అడ్డు చెప్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల మండలానికి వచ్చిన మంత్రి సీతక్కకు వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించినట్లు మహిళా సంఘాలు పేర్కొంటున్నారు. పాత ఐకేపీ భవనంలో గ్రంథాలయం ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు భవనాన్ని మంగళవారం పరిశీలించి గేటు తాళం తెరవాలని ఐకేపీ అధికారులను కోరారు. ఐకేపీ అధికారులు ఎవరు కూడా ముందుకు రాకపోవడంతో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పాత భవనం తాళం పగలగొట్టి గ్రంథాలయం ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న మహిళా సంఘాలు బుధవారం ముందుకు పాత ఐకేపీ కార్యాలయంలో ఆ తరువాత ప్రధానరహదారిపై ధర్నా చేపట్టారు. తమ భవనంలో గ్రంథాలయం ఏర్పాటు చేయవద్దని వేరే ఇతర చోట ఏర్పాటు చేసుకోవాలని నినాదాలు చేశారు. ఎమ్మెల్యే వచ్చే దాకా రాస్తారోకో విరమించేది లేదని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే సొంత నిధులతో గ్రంథాలయం నిర్మించాలని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ దండె విఠల్ ధర్నా చేస్తున్న మహిళా సంఘాల తో మాట్లాడారు. అనంతరం కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్య వివరించి మండల సమాఖ్య అధ్యక్షురాలు కమలా బాయితో మాట్లాడించారు. గ్రంథాలయ భవనం వేరే చోటికి మారుస్తామని, ఎలాంటి సమస్య రాకుండా చూస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో మహిళా సంఘాలు తమ ధర్నాను విరమించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి తులసమ్మ, కోశాధికారి మీరాబాయి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బెజ్జూరు, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటలమానేపల్లి గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ చాకటి విజయ్ తల్లి సుశీల మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు బుధవారం పరామర్శించారు. అంతకు ముందు ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

సమ్మె నోటీసు అందజేత

సిర్పూర్(టి), మే 14(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మండల కేంద్రంలోని సివిల్ సప్లయి గోదాం ఇన్‌చార్జి అధికారికి బుధవారం హమాలీలు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో హమాలీలు ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

బెజ్జూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరకగూడలో బుధవారం హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన అంగరంగా వైభవంగా జరిగింది. వేదమంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. అనంతరం గంగాజలంతో జలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణ

రెబ్బెన, మే 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆధ్వర్యంలో యువతీ, యువకులకు తేనేటీగల పెంపకంపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు అధికార ప్రతినిధి(పర్సనల్ మేనేజర్) రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సింగరేణి సంస్థ ఉచిత శిక్షణ ఇవ్వనుందన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని సింగరేణి ప్రభావిత ప్రాంతాలు, భూ నిర్వాసితులు, సింగరేణి సేవా సమితి సభ్యులు, స్వశక్తి సంఘాల మహిళలు, నిరుద్యోగ, యువతీ, యువకులు శిక్షణ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. తేది 30-05-2025 సాయంత్రం 5 గంటలలోపు సింగరేణి జనరల్ మేనేజర్ డిపార్టుమెంటులో లిఖిత పూర్వక దరఖాస్తులను అందించాలని కోరారు. ఇతర వివరాలకు 9951214116ను సంప్రదించాలని సూచించారు.

మంత్రుల సభకు స్థల పరిశీలన

పెంచికలపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్, పంచాయతీ రాజ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఈ నెల 16న పెంచికలపేట మండలంలో నిర్వహించే భూ భారతి కార్యక్రమంలో పాల్గొనున్నారు. ఈ నేపథ్యంలో సభ స్థలాన్ని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆవరణను అధికారులతో కలిసి ఎమ్మెల్సీ దండె విఠల్ పరిశీలించారు. రూట్, బందో బస్తు, హెలిప్యాడ్, హెలిప్యాడ్ బందోబస్తు, బహిరంగ సభ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఆయన వెంట డీఎస్పీ రామానుజం, సీఐ రమేష్, తహసీల్దార్ వెంకటేశ్వరావు, ఎస్సైలు కొమురయ్య, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలి



చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న డీఎస్పీ రామానుజన్

సిర్పూర్(టి), మే 14(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి, వెళ్లే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని డీఎస్పీ రామానుజన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పెద్దబండ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్ పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి, మండలాల నుంచి వచ్చే వాహనాన్ని పకడ్బందీగా తనిఖీ చేయాలని సూచించారు. 24 గంటలు చెక్ పోస్టులో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం జక్కాపూర్, వెంకట్రావుపేట, చెక్ పోస్టులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్సై కమలాకర్, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఛత్రపతి శంభాజీ జయంతి

వాంకిడి, మే 14(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శంభాజీ మహారాజ్ జయంతిని బుధవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ శంభాజీ మహారాజ్ మంచి యోధుడు, పండితుడు, రచయిత, ఆలోచనపరుడన్నారు. ఆయన జీవితకాలంలో ఆయన చేసిన యుద్ధాలన్నింటిలోనూ విజయం సాధించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సందీప్, వినేష్, శ్యాంరావు, ప్రతాప్, రషన్, బల్వంత్, కిషన్, మనోజ్, జైపాల్, వెంకటి, వివేక్, అన్నారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వాంకిడిలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కౌటాల, మే 14 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను ప్రతీఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సూచించారు. బుధవారం మంలంలోని వీర్దండి గ్రామంలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టుదలతో పోరాడి ఎన్నో విజయాలను సాధించారన్నారు. యువత శివాజీ అడుగు జాడల్లో నడిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఆరె సంఘం నాయకులు శివరాం, రేణుక, మనీష్, మధుకర్ పాల్గొన్నారు.